# అయిదేండ్ల ★ ★ అనంతరం

రచన : మైత్రి

దీపావళి వస్తూందంటే ఒకవైపు సంతోషం—మరియొక వైపు విచారం. సుఖ - దుఃఖాల సమన్వయంలో ఆనాడెందుకో నూతనోత్సాహం ఉదయించింది లలితలో. ఆమె ఏనాడూ అంతటి ఉత్సాహంతో పనిచేయలేదు. ఇంటిపనులన్నీ చక్కగా చేసి, అద్దంలాగ గదులన్నీ శుభ్రపరచి, బల్లపై ఒక పటం పెట్టి దానికి వడుకునూలు దండలు రంగురంగుల గుడ్డలతో అందంగా తయారుచేసి అలంకరించింది.

ఒక్క ఆ పటంవైపుచూచి రెండు అశ్రుకణాలు రాల్చి తిరిగి పమిటచెంగుతో తుడుచుకుంది. ఆమెకు ఏవో పూర్వకాలపు స్మృతులు జ్ఞాపకంవస్తున్నాయి. ఆమె కళ్ళకు ఎదురుగానున్న పటంలో, చిన్నప్పుడు తనూ - ఆ పటంలోని మనిషీ ఆడుకోవటం, తర్వాత స్కూలుకువెళ్ళటం, ఇద్దరూకలసి జాతీయవాదం - గాంధీజయంతి రోజులలో ఖద్దరు అమ్మటం అన్నీ ఒకటి వెంట ఒకటి భూతకాలపు ఒడినుండి వెలువడి వడివడిగా మాయమయిపోయినయి.

ఇంతలో వీధిలోనుండి "లలితా" అన్న కేక వినబడింది. లలిత ఒక్కసారిగా భూతకాలంనుండి వర్తమానములోకి ప్రవేశించింది. ఎండలో ఉండి ఉండి నీడకురాగానే అంధకారమయముగా కనిపించినట్లు, ఒక్కసారి ఆమెకేమీ తోచలేదు. ఇంతలో "అమ్మా" అన్న రెండవకేక ఆమెను స్పృహకు తెచ్చింది.

గబగబావచ్చి తలుపుతీసింది. భర్త, కొడుకు బజారు నుండి తిరిగివచ్చారు.

"అమ్మా! అమ్మా!! టపాకాయలు, చిచ్చుబుడ్లు, మతాబాలు, కాకరపువ్వొత్తులు, ఎర్రగ్గిపెట్టెలు, పచ్చగ్గిపెట్టెలు, రంగుల రంగులపూలు అ......న్ని కొన్నాము. చూశావా బుట్టనిండా ఎన్నివచ్చాయో? ఇంకా నాన్నగారు తినడానికి మిఠాయి, జీడిపప్పు పాకం, కారప్పూస, అరటిపళ్ళు ఇంకా ఇంకా అన్నీ తెచ్చారే" అని కుర్రాడన్నాడు.

"మరి నన్ను మర్చిపోయావా?" అన్నది లలిత.

"నీకే నాన్నగారు శిల్కుచీర కొన్నారు" అన్నాడు.

"మరి నాన్నగారు".

"ఏవో కాగితం......కాగితం సంతకంచేసి తీసుకున్నారే".

"ఏమండీ రాగానే నా మొహంవంక చూస్తూ అలా కూర్చున్నారేం? భోజనాలకి టయిమవుతోంది లెండి. భోంచేసి కబుర్లకు కూర్చుందాం".

"అయితే నీకేం కబుర్లక్కరలేదా? ఇవాళ ఇల్లంతా నవ్వుతూన్నట్టుంది నిన్నుచూస్తే".

"కబుర్లేమున్నాయి బజారుకబుర్లేగా".

"సరేగాని, నేనువచ్చేసరికి ఆ ఫొటోవంక అలాగే చూస్తున్నావు".

ఏమీలేదు. ఊరికే అయిదేళ్ళయింది సరిగ్గా. ఇంత వరకు ఏమో ఏమీ తెలియదు. నాన్న వాడినిచూద్దామనే కోరికతోనే పోయారు. అమ్మ ఆ కోరికతోనే ఉంటుంది" అంటూ లలిత ఒకసారి పమిటచెంగుని ముఖానికి కడ్డం పెట్టుకుని కళ్ళుతుడుచుకుంది.

"ఏయ్! ఇలా చూడు. నువ్వెందుకు ఇల్లంతా శుభ్రం చేసి ఆ ఫొటోవంక అలా చూస్తున్నావో నాకు తెలుసు చెప్పనా?"

"చెప్పండి ఏం, చెపతారో చూస్తాను".

"మీ అన్నయ్య వస్తాడని".

"నిజంగా. ఊరికేనే అంటున్నారు మీరు. ఎందుచేతనో. ఇవాళ మాటి మాటికి అన్నయ్యే గుర్తువస్తున్నాడు నాకు".

"లలితా! ఇటుచూడు. తొందరగా భోజనంచేసి స్టేషనుకు వెళదాం లే".

"ఎవరువస్తున్నారివాళ?"

"నేను చెప్పలేదు? మీ అన్నయ్య".

"ఆఁ. ఊరికినే నన్ను ఆడిద్దామని అంటున్నారు. నిజంగానా?",

"అవును. మీ అన్నయ్య నిన్న ఢిల్లీవచ్చేడట. రాగానే టెలిగ్రాం ఇచ్చాడు. ఇదిగోచూడు. ఈపూట ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు".

"అమ్మయ్య ఎంతకాలం ? అయిదేళ్ళు ! అయిదేళ్ళ తర్వాత !"

* * *

ప్రకాశ్ చెల్లెలిని వదలి అయిదేళ్ళయింది. బావమరిదితో కుటుంబ దేశవిషయాలు మాట్లాడి చెల్లెలు దగ్గరికి వచ్చాడు.

తను సైన్యంలో చేరాక బర్మారంగం వెళ్ళటం, అక్కడ బ్రిటిషువారు ఓడిపోవడం, తను మళ్ళా ఆజాద్ హింద్ ఫౌజులో పోరాడటం, తిరిగి ఖైదీగా పట్టుబడటం మొన్న విడుదలకావడం చెప్పాడు. చాలాకాలంతర్వాత చూచినందుకు అన్నా చెల్లెళ్లు ఒకరినొకరు చూచుకుంటూ అలాగ ఉండిపోయారు.

తర్వాత కొంతసేపటికిద్దరూ తెలివితెచ్చుకుని చూచేసరికి బావమరిది ఎదురుగా నవ్వుతూ అన్నా చెల్లెళ్ళ తన్మయులైవుండటం చూస్తున్నాడు.

తన మేనల్లుడు కలగటంతో అంతులేని ఆనందం అనుభవించాడు ప్రకాశ్.

దేశంలోని మార్పులుచూస్తే అతనికే ఆశ్చర్యం వేసింది. అయిదేళ్ళక్రితం బానిసదేశంలో దీపావళినాడు తల్లితండ్రులవద్ద ఆశీర్వచనంపొంది దేశం ఒదిలినాడు. నేడు తిరిగి స్వతంత్ర భారతదేశంలో తన బంధువులను మిత్రులను కలుసుకుంటున్నాడు.

సాయంత్రం ప్రకాశ్, బావమరిది, మేనల్లుడు, చెల్లెలుతో తల్లినిచూడటానికి ప్రయాణమయ్యాడు. కారు వేగంకంటె ప్రకాశ్‌హృదయం వేయిరెట్లధికముగా పరిగెడుతూంది. తల్లినివిడిచి అయిదేళ్ళు. ఈలోగా పితృవియోగం - చెల్లెలికి కొడుకు - దేశానికి స్వతంత్రం. ప్రకాశ్‌లో రెండుశక్తులూ సంఘర్షించుకుంటున్నాయి. పొలాలుదాటి తారురోడ్డుమీద, ఊళ్ళమధ్యనుంచి కారు పోతూంది. పిల్లగాలుల పీచికలకు తలవెంట్రుకలెగురుతున్నయి.

లలిత తన కొడుక్కి ప్రకాశ్‌ని చూపిస్తూ "మావయ్యరా" అంటూంది.

ప్రకాశ్ గ్రామంవచ్చేడు. తల్లినిచూచేడు. అయిదేండ్లలో చాలా మార్పువచ్చింది. ఇంటివద్ద వ్యవసాయం తన మేనల్లుని సహాయంతో చూస్తూంది. కొడుకుకై ఆశ వదలుకుంది. కాని ఈ నిరాశామయ జీవితంలో ఏమూలైనా బ్రతికి సుఖంగావుంటే చాలనే కోరిక ఆశను కల్పిస్తూంది.

తల్లీ కొడుకులు కౌగలించుకున్నారు. అయిదేళ్ళ అనంతరం తిరిగి కలుసుకొంటున్నారు. ఆనాడు దీపావళినాడు ఆశీర్వాదములతో కొడుక్కి వీడ్కోలిచ్చేరు తల్లితండ్రులు. నేడు నిరాశామయ జీవితానికి ఆశాజ్యోతిగా ఆహ్వానించగలిగింది తల్లిమాత్రమే.

అయిదేళ్ళనుండి సరిగా జరుపుకోని ఈ దీపావళి దేశస్వాతంత్ర్యం కొరకై ప్రాణాలర్పించిన వీరుల సహచరి, తన కొడుకు ప్రకాశ్‌ని ఆహ్వానిస్తూ అల్లుడూ, కూతురూ, మనుమలతో [illegible]తో ఆనందంగా, అయిదేండ్ల లోటు తీరునట్లు తల్లి జరుపుకుంది.

కాని ప్రకాశ్‌కి ఎందుచేతనో అంత సంతోషంగా లేదు. గ్రామంలో చూచాడు. హైదరాబాదునుండి, పంజాబునుండి పారిపోయివచ్చిన శరణార్థులు ఆశ్రయం లేక అల్లాడిపోతున్నారు. సోదర దేశీయులలో మతంపేరిట అభిప్రాయభేదాలు, ద్వేషాలు ఎక్కువగాఉన్నాయి. పవిత్రమైన, ప్రపంచంలో శాంతికి పేరుగాంచిన, ఆశియా మార్గదర్శిని భారతదేశం మూడుముక్కలుగా చీలిపోవడం ప్రకాశ్ కళ్ళయెదుట కనపడుతూంది. అతనిలో నేతాజీ సందేశం తిరిగి రక్తాన్ని వేడెక్కించింది.

ఆజాద్ హింద్‌ఫౌజ్ సైనికులకు నేతాజీ సందేశం ఇస్తూ "అహింస అన్నిటికన్నా గొప్పది. కాని దానిని ఆచరించటానికి ధైర్యంవుండాలి. శక్తిసామర్థ్యాలు కలవాడే క్షమించగలుగుతాడు, గాన అందరం యుద్ధం చెయ్యాలి. ఆనాడు ఆత్మశిక్షణ అలవరుచుకుని "అహింసను" ప్రపంచంలో వ్యాపింపచేయగలం"అని అన్నాడు.

ప్రకాశ్‌లో ఈ సందేశ ప్రతిధ్వనులు మార్మ్రోగాయి. దీపావళినాడు తన ప్రయత్నానికి పునాది వేశాడు. గ్రామప్రజలను సమకూర్చాడు. తను నేర్చుకున్న విద్యలు నేర్పాడు. పరిసర ప్రాంతాలనుండి పారిపోయివచ్చిన కాందిశీకులలో నూతన ధైర్యసాహసాలు నింపి, నిరంకుశ ప్రజా వ్యతిరేకశక్తులపై - ప్రజల శాంతి, శ్రేయస్సుల రక్షణకై నాయకత్వంవహించాడు.

ఈపని తనకొడుకు నాయకత్వంలో త్వరగా నెరవేరి విజయుడుకావాలని తల్లి దీపావళినాడు ఆశీర్వదించింది.

ఐదేండ్ల అనంతరం తిరిగి తల్లి ఆశీర్వచన సాఫల్యత కొరకు నడుంకట్టాడు ప్రకాశ్ !